భూ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

- జిపిఒ, ప్రయివేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం అందులో భాగమే
- ధరణి అక్రమాల వల్లే గత ప్రభుత్వం ఓడిపోయింది
- భూ సర్వేలో నిజాయితీగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరుతెండి
- సర్వేయర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం
- 3,456 మందికి నియామక పత్రాలు అంధజేత



మృతి చెందిన నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో శిక్షణ పొందిన 3,456 మంది ప్రయివేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజుల కాలం నుంచి నేటి వరకు భూమి మీద ఆధిపత్యం కోసం యుద్ధాలు జరిగాయనీ, అదే భూమి సర్వేలో తప్పులు చేస్తే ప్రజలు తిరగబడే అవకాశం ఉందని సిఎం హెచ్చరించారు. "తెలంగాణలో ప్రతీ పోరాటం భూమి చుట్టూనే జరిగింది. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం నాటి సాయుధ రైతాంగ పోరాటం జరిగింది. జల్, జంగల్, జమీన్ కోసం కొమురం భీం, ఇస్నూర్ దొరల ఆక్రమణ నుంచి తన భూమిని విడిపించుకునేందుకు వీరోచిత పోరాటం చేసిన చాకలి ఐలమ్మలే మనకు ఆదర్శం. భూమిని కన్న తల్లిలా మనమంతా భావిస్తాం. భూ యజమానుల హక్కులను కాపాడి, భూ సరిహద్దులను నిర్ణయించే బాధ్యత మీపై పెట్టబోతున్నాం. మీరు తప్పు చేస్తే మీకే కాదు.. ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తుంది అందుకే ప్రతీ ఒక్కరు బాధ్యతగా పనిచేయండి" అని వారికి సిఎం దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వంలో తెచ్చిన ధరణి చట్టం కొద్ది మంది దొరలకు చుట్టంగా మారిందని వ్యాఖ్యానించారు. "భూ ఆక్రమాలు, అవినీతి వల్ల ఓ ఎంఆర్వోను పెట్రోల్ పోసి తగుల బెట్టిన ఘటనలను చోటు చేసుకున్నాయి. ధరణి భూతాన్ని పెంచి పోషించి భూమిపై ఆధిపత్యాన్ని చెలాయించాలనుకున్న గత పాలకులను ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు. అధికారంలోకి వచ్చాక ధరణి దరిద్రాన్ని వదిలిస్తామని ఎన్నికల ముందిచ్చిన మాట ప్రకారం.. అధికారంలోకి రాగానే ధరణి నుంచి విముక్తి కల్పించాం" అని సిఎం రేవంత్ అన్నారు. తెలంగాణలో భూ హక్కులు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. సీలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చి జాగిర్దార్ల వ్యవస్థను రద్దు చేశామని చెప్పారు. ఫలితంగా రాష్ట్రంలో దాదాపు 25 లక్షల ఎకరాల భూమిని పంచామని సీఎం పేర్కొన్నారు. "పదేండ్లు రాష్ట్రంలో అధికారాన్ని చెలాయించిన బీఆర్ఎస్ నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోలేదు. 15 సంవత్సరాల పాటు గ్రూప్-1 నియామకాలను చేపట్టలేదు. తాము అధికారం చేపట్టిన వెంటనే టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేశాం. మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలిచ్చాం. త్వరలో గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాలను భర్తీ చేస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే మా లక్ష్యమని చెప్పారు. ఆ దిశగా ముందుకెళ్లేందుకు నిబద్ధతతో పని చేయాలని సిఎం వారికి సూచించారు.

ప్రజల కోసం పనిచేయండి: మంత్రి పొంగులేటి

ప్రయివేట్ లైసెన్స్ సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ప్రజల కోసం పని చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ధరణి పేరిట చేసిన తప్పులను సరిదిద్దేందుకు తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో బాగస్వాములు కావాలని కోరారు. సాదా బైనామాలు, ఇతర భూ సమస్యలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 9.80 లక్షల దరఖాస్తులను దశలవారీగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వ ఆలోచనలకనుగుణంగా చిత్తశుద్ధితో పనిచేయాలని వారికి విజ్ఞప్తి చేశారు. నిబద్ధతతో పని చేస్తామని ఈ సందర్భంగా సర్వేయర్లతో పొంగులేటి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మందుల సామేల్, నాగరాజు, జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



యాదవులకు సముచిత స్థానం

- మరిన్ని రాజకీయ అవకాశాలు కల్పిస్తాం : సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ ప్రాతినిథ్యంలో యాదవులకు సముచిత స్థానం కల్పిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనాన్ని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సిఎంకు డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరవాత సదర్‌ను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని కోరిన వెంటనే దానికి అంగీకరించామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ యాదవులకు రాజకీయ అవకాశాలు కల్పించిందని సిఎం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులోకి రావడంలో యాదవులది అత్యంత కీలకమైన పాత్ర అని చెప్పారు. వారికి మరిన్ని అవకాశాల కోసం పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధికి యాదవుల సహకారం కావాలని కోరారు. యాదవుల సహకారంతో హైదరాబాద్‌లో శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నాయని, పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నట్టు తెలిపారు. యాదవరాజులు పాలనా కాలం నుంచి హైదరాబాద్‌లో సదర్ ఉత్సవాలను నిర్వహిస్తున్నారని సిఎం గుర్తుచేశారు. ఏ కష్టం వచ్చినా నమ్మినవారికి అండగా ఉండటం యాదవుల లక్షణం అని కొనియాడారు. యాదవులకు మరిన్ని రాజకీయ అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తప్పకుండా వాటిని కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలతో పడిపోతున్న నిజవేతనాలు

- పర్మినెంట్ ఉద్యోగాల్లో కోతపెట్టి స్కీం వర్కర్లతో పనులు
- నాన్ పర్మినెంట్ విధానంతో శ్రమదోపిడీ : చుక్క రాములు, ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మృతి చెందిన నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

డిసెంబర్ 31వ తేదీ నుంచి జాతీయ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, విశాఖపట్టణం వేదిక అవుతుందన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా సిఐటియు నాల్గవ మహాసభ సదాశివపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సిఐటియు జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళి అర్పించారు. ఇటీవల కాలంలో మృతి చెందిన సిపిఎం, సిఐటియు నాయకులకు నివాళి అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సిఐటియు మహాసభను గోపాల్ నగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గ పోరాటాలు ఉధృతంగా జరుగుతున్నాయని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు అన్నారు. పెట్టుబడిదారు విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ధరల పెరుగుదల వల్ల కార్మికుల నిజవేతనాలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ ఉద్యోగాల్లో కోతపెట్టి స్కీం వర్కర్లతో పనులు చేయిస్తున్నారని తెలిపారు. దేశ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకుంటున్నారని, రష్యా నుంచి భారతదేశం చమురు కొనుగోలు చేయదని ప్రకటిస్తే ప్రధాని నరేంద్రమోడీ స్పందించడం లేదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య అన్నారు. కనీస వేతనాలు ఇవ్వకుండా స్టైఫండ్ పేరుతో, ఇంటెన్సివ్ పేరుతో, కాంట్రాక్టు పేరుతో, ఫిక్సిడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో యాజమాన్యాలు నాలుగు లేబర్ కోడ్ల ద్వారా దోచుకుంటున్నాయని అన్నారు. సిగాచి పరిశ్రమలో పేలుడు జరిగి కార్మికులు చనిపోతే వారి వద్ద కార్మికుల రికార్డులు లేవన్నారు. దోపిడీని ఎదిరించాలంటే ఐక్య ఉద్యమాలే పరిష్కారమని అన్నారు. ఈ మహాసభల్లో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె మల్లిఖార్జున్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.మల్లేశం, జి సాయిలు, కె రాజయ్య పాల్గొన్నారు.

రాయితీలు కాదు రాజ్యాధికారం కావాలి

- బిసి రిజర్వేషన్లపై ప్రజా ఉద్యమాలతో కేంద్రం మెడలు వంచాలి
- హిస్సా ఇజ్జత్ హుకుమాత్ పుస్తకావిష్కరణలో రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న చిరంజీవులు

'రాయితీలు మాకొద్దు... రాజ్యాధికారం కావాలి. అందుకోసం రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల కోసం తెలంగాణ ఉద్యమాన్ని తలపించేలా ఆందోళనలు చేపట్టాలి. ప్రజా ఉద్యమాలను నిర్మించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచాలి. పోరాటాల ద్వారానే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు వస్తాయి' అని హిస్సా ఇజ్జత్ హుకుమాత్ పుస్తక రచయిత రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో బిసిలకు హక్కులు రాజ్యాధికారం కోసం రచించిన పుస్తకాన్ని చిరంజీవులు ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌గా పదవీ విరమణ పొందిన తర్వాత బిసి ప్రజల కడుపు మంట చూసి ఉద్యమాలలోకి వచ్చానని ఆయన అన్నారు. బిసి రిజర్వేషన్ల పోరాటం అంతం కాదని ఇది ఆరంభం మాత్రమేనని అన్నారు. అధికారం యాచనతో రాదు ఉద్యమాలు చేసి గుంజుకోవాలని అన్నారు. స్వాతంత్రం వచ్చి 78ఏండ్లు పూర్తి అయిన తర్వాత కూడా నేటికీ బిసిలు యాచనస్థితిలో ఉన్నారని ఇక్కడి పెత్తందారులు నిజాం నవాబు కంటే క్రూరమైన వారని అన్నారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో బిసి సిఎంలు ఉన్నారని, తెలంగాణలో బిసిలు ఆ స్థాయికి ఎందుకు ఎదగడం లేదని ప్రశ్నించారు. 32 లక్షల కోట్లలో బిసిలకు ఇచ్చేదంతా అని ప్రశ్నించారు. అంబానీకి 47 వేల కోట్లలో 470 కోట్లు చెల్లిస్తే మిగతావన్నీ మాఫీ చేశారని ఆయన అన్నారు. భారత కష్టజీవుల డబ్బులు గొప్పలకు రుణమాఫీగా మారుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ చేపట్టిన బంద్ సంపూర్ణమైందని ప్రధానమైన మీడియాలో బంద్ విజయోత్సవాలపై కథనాలు రాకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ మోసం చేస్తే బిజెపి కుట్ర చేస్తోందని, బిఆర్ఎస్ మాత్రం గోడమీద పిల్లిలా భోగి సలాట ధోరణి ప్రదర్శిస్తున్నదని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రం మెడలు వంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పేదలు బడుగు బలహీన వర్గాల్ల వారికి కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుతుంటే ఎందుకు అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో సింగిశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యాయుల గుడిపల్లి నిరంజన్, సుబ్బయ్య, నిరంజన్, పెబ్బేటి మల్లికార్జున్, చిన్న రాములు, దిలీప్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కుల దురహంకార హత్యపై కఠిన చర్యలు తీసుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కుల దురహంకార హత్యపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుమురంభీం - అసీఫాబాద్ జిల్లా, దహెగాం మండలం, గెర్రె గ్రామంలో జరిగిన కుల దురహంకార హత్య దుర్మార్గమని తెలిపారు. ఎస్‌టి (కోయ) కులానికి చెందిన తలండి శ్రావణ రాణి, అదే గ్రామానికి వెనుకబడిన కులానికి చెందిన శివార్ల శేఖర్ ఇద్దరూ తల్లిదండ్రులను ఎదిరించి ఏడాది క్రితం కులాంతర వివాహం చేసుకున్నారని పేర్కొన్నారు. శేఖర్ తండ్రి సత్తయ్య ఈ వివాహాన్ని జీర్ణించుకోలేక, రాణిని గొడ్డలితో నరికి అత్యంత దారుణంగా హత్య చేశాడని తెలిపారు.. రాణి నిండు గర్భిణిగా వున్నప్పటికీ ఈ ఘాతుకానికి పాలడటం సభ్య సమాజాన్ని కలచి వేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాపితంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించటం లేదనీ, వీటిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్నదని ఆరోపించారు. కుల, మతాంతర వివాహితుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి హత్యలు జరుగకుండా ప్రభుత్వం ప్రజల్లో సామాజిక చైతన్యం కలిగించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

21న పోలీసు అమరవీరుల సభ

- గోషామహల్ స్టేడియంలో సాయుధ బలగాల పరేడ్
- ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి
- ఈ నెల 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు
- డిజిపి శివధర్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల సంస్మరణార్థం ఈ నెల 21న హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో గల పోలీసు అమరవీరుల స్తూపం వద్ద సాయుధ బలగాల పరేడ్, సభ ఉంటాయని, ఆ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరవుతారని రాష్ట్ర డిజిపి ఎ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 21 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1959 అక్టోబర్ 21 లడాఖ్ సమీపంలో చైనా సైనికులు జరిపిన దాడులను తిప్పికొడుతూ ఎస్ఐ కడఖ్ సింగ్‌తో సహా 10 మంది జవాన్లు వీరమరణం పొందారని, వారి ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు. పది రోజుల పాటు ప్రజలు, పోలీసుల భాగస్వామ్యంతో పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, అందులో పోలీసుల పనివిధానంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ముఖ్యంగా సిసి కెమెరాలు, భరోసా, షి టీమ్, సైబర్ టీమ్, తదితర విభాగాల పనితీరుపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. పోలీస్ కమిషనరేట్, జిల్లా కేంద్రాల్లో ఎస్పి హెడ్ క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు, యువతకు వ్యాస రచన పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి పోలీసు వ్యవస్థను పటిష్టం చేయడం, పనిచేసే ప్రాంతాల్లో లింగ వివక్షను రూపుమాపడం వంటి అంశాలపై వ్యాసరచన పోటీలుంటాయని, పోలీసుల పనివిధానంపై మూడు నిమిషాల నిడివితో లఘుచిత్రాల పోటీలుంటాయని వివరించారు. వాటిలో నెగ్గిన వారికి బహుమతులు ఇస్తామని తెలిపారు. పోలీసుల త్యాగాలను గుర్తించేందుకు ట్యాంక్‌బండ్ మొదలుకుని పలు బహిరంగ ప్రదేశాల్లో వీకెండ్‌లలో పోలీసుల బ్యాండ్ ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 191 మంది పోలీసులు అమరులయ్యారని, అందులో రాష్ట్రానికి చెందిన వారు ఐదుగురున్నారని తెలిపారు.

21ఏళ్లకే ఎమ్మెల్యేగా పోటీ

- రాజ్యాంగ సవరణపై అసెంబ్లీలో తీర్మానం చేస్తాం
- 'జూబ్లీ' ఎన్నికలపై బిజెపి, బిఆర్ఎస్ చీలిక కుట్రలు
- బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు రాకపోవడానికి ఆ రెండు పార్టీలే కారణం : సిఎం
- సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్ గాంధీ సద్భావన అవార్డు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పద్దెనిమిది ఏళ్లకే ఓటు హక్కును కల్పించి దేశ అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అదే స్ఫూర్తితో 21 ఏళ్లకే శాసనసభ్యుడిగా పోటీ చేసే అవకాశం కల్పిస్తూ రాజ్యాంగ సవరణ తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. దానిపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని అన్నారు. హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షిద్‌కి "రాజీవ్ గాంధీ సద్భావన అవార్డు"ను ప్రదానం చేశారు. అనంతరం సిఎం మాట్లాడుతూ దేశంలో గాంధీ అనే పదం భారతదేశానికి పర్యాయపదం అనీ, గాంధీ కుటుంబం దేశానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఇందిరా గాంధీ ప్రాణాలర్పించారని, దేశం కోసం మూడు తరాలు ప్రాణాలర్పించిన చరిత్ర గాంధీ కుటుంబానిదన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఆనాడు రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేశారనీ, ఆయన స్ఫూర్తిని కొనసాగించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సల్మాన్ ఖుర్షీద్‌కి రాజీవ్ సద్భావన అవార్డ్ అందించడం అందరికీ గర్వకారణం అన్నారు.

రాజీవ్ స్ఫూర్తితో రాహుల్ గాంధీ దేశ సమగ్రత కోసం భారత్ జోడో యాత్ర చేశారని అన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ బిజెపికి బి టీమ్‌గా మారిందనీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య రహస్య ఒప్పందం జరిగిందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 21 శాతం బిఆర్ఎస్ ఓట్లు ఎవరికి చేరాయనీ, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అదే చేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఓట్లు చీల్చాలని ఇప్పటి నుంచే కుట్ర చేస్తున్నారన్నారనీ, ఈ కుట్రలను తెలంగాణ సమాజం తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు రాకపోవడానికి కూడా ఆ రెండు పార్టీలే కారణమన్నారు.ఈ కుట్రలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణను అభివృద్ధివైపు నడిపిద్దామని అన్నారు.



సెక్యులరిజానికి కట్టుబడ్డ కాంగ్రెస్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మతసామరస్యానికి గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ అంకిత భావంతో పని చేసిందనీ, సెక్యులరిజానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. 35 ఏళ్లుగా నిరంజన్ నేతృత్వంలో రాజీవ్ గాంధీ సద్భావన స్మారకోత్సవం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కాంగ్రెస్ నాలుగు శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందనీ, కొన్ని న్యాయపరమైన చిక్కులు ఎదురైనా అమలు చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పం అన్నారు. ఈ రిజర్వేషన్ల ప్రక్రియను అడ్డుకుంటున్నదెవరో చైతన్యవంతమైన సభ్య సమాజం గుర్తించాలన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారోకోత్సవ సభలకు అనేక ఆటంకాలు ఎదురయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపి వి హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ సలహాదారులు హర్కు వేణుగోపాల్ రావు, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మదన్ మోహన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దీపావళి నేపథ్యంలో అన్ని ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రాష్ట్ర ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్రమైన పండుగ సందర్భంగా, ప్రతి ఇంట్లో జ్ఞానం, సంతోషం, శ్రేయస్సు అనే వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆయన లక్ష్మీ దేవిని ప్రార్థించారు.ప్రజలకు నూతన ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని అందించాలని కోరుకున్నారు. హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి ఆస్పత్రితో పాటు ఇతర హాస్పిటళ్లలోని కంటి చికిత్స విభాగాల్లో డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అందుబాటులోని ఉండాలని ఆదేశించారు. దురదృష్టవశాత్తూ ఎవరైనా కంటి గాయాలు, కాలిన గాయాలతో వస్తే, వారికి తక్షణమే చికిత్స అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అవసరమైన మెడిసిన్, ఎక్విప్‌మెంట్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా ప్రజలు బాణసంచా విషయంలో జాగ్రత్తలు తీసుకుని, సురక్షితంగా దీపావళిని జరుపుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు.పిల్లల విషయంలో తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, బాంబులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. పసి పిల్లలను టపాసులకు దూరంగా ఉంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తులు

- ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎంజెపి ద్వారా పిజెటిఎయు అనుబంధ కళాశాలలో (బిఎస్‌సి) అగ్రికల్చర్ కోర్స్‌లో ప్రవేశం కోసం ఈ నెల 21 నుంచి 29 వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎంజెపి) కార్యదర్శి బడుగు సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కోర్సులో ప్రవేశం కోసం ఇంటర్‌మీడియట్ (బైపిసి), దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణతతో పాటు తెలంగాణ స్టేట్ టీజీ ఇఎపిసెట్-2025 పరీక్షలో అర్హత సాధించిన వెనుకబడిన తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే గ్రామీణ ప్రాంతంలో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతంలో వార్షిక ఆదాయం రూ. రెండు లక్షలకు మించకూడదని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు https://mjptbc wreis. telangana.gov.in, https:// www. pjtau. edu.in వెబ్‌సైట్‌లను సందర్శించాలని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుము రూ.1,000 ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలనీ, అవసరమైన అన్ని ధ్రువపత్రాలను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు ఆఫీస్ పని దినాల్లో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు 040-23328266ను సంప్రదించాలని కోరారు.mjpadmissioncell@gmail.com కు మెయిల్ చేయాలని సూచించారు.

కల్లుగీత కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి

- కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవంలో వక్తలు
- కవులు, రచయితలు, కళాకారులతో ఆత్మీయ సమ్మేళనం.

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవంలో పాల్గొన్న కవులు, రచయితలు, కళాకారులు

కల్లుగీత కార్మిక సంఘం 68వ వార్షికోత్సవం ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రముఖ కవులు, రచయితలు, కళాకారులు హాజరయ్యారు. కల్లుగీత వృత్తిలో ఇబ్బందులతో పాటు తాటి ఈత చెట్ల ఔన్నత్యాన్ని తెలియజేస్తూ పాటలు, కవితలు వినిపించారు. ఆ సంఘం అధ్యక్షుడు ఎంవి.రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో రోజురోజుకూ అనేక మార్పులు జరుగుతున్నాయని, కల్లుగీత వృత్తిలో కూడా ఆధునీకరణ తీసుకురావాలని, అందుకు ప్రభుత్వాలు పూనుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కోటి తాటి, ఈత చెట్ల సంపద ఉందని, ఐదు లక్షల కుటుంబాలు వీటిపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. ప్రకృతి పానీయం కల్లు, నీరా ఆరోగ్యానికి ఎంతో మంచిదని, తాటి ఈత చెట్ల ద్వారా అనేక ఉత్పత్తులు తయారు చేయవచ్చని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు అనేక హక్కులు సంఘం ద్వారా సాధించుకున్నామని తెలిపారు. సొసైటీలు, గీచే వానికే చెట్టు పథకం, పెన్షన్, ఎక్స్‌గ్రేషియా, చెట్ల పెంపకానికి భూమి, నీరా కేఫ్, ప్రమాద నివారణకు సేఫ్టీ కిట్ లాంటి కొన్ని సమస్యలు పరిష్కరించుకున్నామని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి ఎంతో గొప్పదని చెప్పారు. కల్లుగీత కార్మికుల కష్టాలను పరిష్కార మార్గాలను పాటలు, కవిత్వం, రచనల ద్వారా సమాజానికి తెలియజేయాలని కళాకారులకు విజ్ఞప్తి చేశారు. కల్లుగీత వృత్తిలో ప్రమాదాల బారిన పడిన వారికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్న సుప్రజ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శిగ విజయ్ కుమార్ గౌడ్‌కి, వృత్తిలో మరణించిన కుటుంబాలకు ఆర్థిక సహాయం, పిల్లల చదువుల కోసం సహాయం అందిస్తున్న కాన సంస్థకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారి ప్రతినిధి నాతి గణేష్ గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్, కన్వీనర్ ఐలి వెంకన్న గౌడ్, ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్, అంబాల నారాయణ గౌడ్, వంగ సదానందం గౌడ్, ప్రముఖ కవులు, రచయితలు, గాయకులు కట్ట గాని రవీందర్, గోపగాని రవీందర్, మానుకోట ప్రసాద్, కోల జనార్ధన్, బుర్రసతీష్, సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి భీమగాని చంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకట నరసయ్య, గొర్రెల మేకల పెంపక దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడత రవీందర్ పాల్గొన్నారు.

దరఖాస్తులు తగ్గినా... ఆదాయం పెరిగింది

- బంద్ నేపథ్యంలో ఈ నెల 23 వరకు గడువు పెంపు : ఎక్సైజ్ కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మద్యం టెండర్ల కోసం దరఖాస్తులు తగ్గినా... 2023 కంటె ఆదాయం పెరిగిందని ఎక్సైజ్ కమిషన్ సి హరికిరణ్ తెలిపారు. బిసి రిజర్వేషన్ల బంద్ నేపథ్యంలో ఈ నెల 18న బ్యాంకులు పనిచేయకపోవడంతో డీడీలు సమర్పించటంలో ఇబ్బందులు ఎదురయ్యాయనీ, గడువు పెంచాలని వ్యాపారుల నుంచి వినతులు రావడంతో ఈ నెల 23 వరకు పెంచినట్టు తెలిపారు. చివరి రోజు శనివారం వరకు దాఖలైన 89,344 దరఖాస్తుల ద్వారా రూ.2,680 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. 2023లో 1.32లక్షల దరఖాస్తుల ద్వారా 26,45 కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పారు. గడువును మరో నాలుగు పెంచడంతో ఆదాయం 3వేల కోట్లు దాటుందని భావిస్తున్నామని చెప్పారు. అలాగే మద్యం షాపుల డ్రాను ఈనెల 27న కలెక్టర్లు నిర్వహిస్తారని తెలిపారు.

విభజన కుట్రలతో విజయం సాధించలేరు

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులం, మతం, భాష, ప్రాంతం పేర్లతో దేశాన్ని విభజించాలనే వారి కుట్రలు ఎప్పటికీ విజయం సాధించలేవని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు చెప్పారు. దేశంలో ఏకత్వాన్ని కాపాడేది తమ పార్టీనే అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం పురస్కరించుకుని ఏక్‌భారత్-ఆత్మనిర్భర భారత్ కార్యక్రమాన్ని ఈ నెల ఆరో తేదీన లాంఛనంగా ప్రారంభించిందని, ఈ నెల 31 వరకు అది కొనసాగుతుందని తెలిపారు. పటేల్ పేరు వింటేనే తెలంగాణ ప్రజల హృదయాలు పులకించిపోతాయన్నారు. ఆయన కృషితోనే తెలంగాణ భారత్‌లో భాగమైందని చెప్పారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు బిజెపికి మంచి అవకాశాలన్నారు. 42 శాతం రిజర్వేషన్ల అమలులో కాంగ్రెస్ పార్టీ ప్రజల్ని మోసం చేసిందనీ, ఇప్పుడు నెపాన్ని ఇతర పార్టీలపై నెట్టాలని చూస్తోందని విమర్శించారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. ఆదివారం వెల్దుర్తి ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నాగరాజు (28) చేసిన వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చడం కోసం మరోచోట అప్పుచేసి టాటా ఎసి కొనుగోలు చేసి కిరాయిలకు తిప్పుతున్నారు. ఈ క్రమంలో చేసిన అప్పులు తీర్చలేక అప్పుడప్పుడు ఇంట్లో గొడవలు దీంజరుగుతుండేవి.

అప్పులు ఇచ్చినవారు ఇంటికి వస్తూ ఉండడంతో మనస్తాపానికి గురై ఆదివారం వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొన్నారు. కొన ఊపిరితో ఉన్న నాగరాజును సమీపంలో గ్రామస్తులు అంబులెన్స్ ద్వారా హుటాహుటిన తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మరణించాడని నిర్ధారించారు. నాగరాజు భార్య సంగీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్ఐ రాజు తెలిపారు.



మోతుగూడలో ఘోర ప్రమాదం

- కారు ఢీకొని ముగ్గురు దుర్మరణం
- ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మోతుగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన ఆదివారం ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...వాంకిడి మండలం బెండార గ్రామానికి చెందిన జగన్ (26) దీపావళి పండుగకు కాగజ్‌నగర్ మండలం వంజరి గ్రామంలో నివాసముంటున్న బావ డోంగ్రి సిద్ధార్థ ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి అక్క అనసూర్య (35), అల్లుడు ప్రజ్ఞశీల్ (4), కోడలు హరికను తీసుకొని బైక్‌పై స్వగ్రామం బెండారకు బయలుదేరాడు. మోతుగూడ వద్ద ఫ్లైఓవర్ ఎక్కుతున్న క్రమంలో వెనుక నుండి అతివేగంతో వచ్చిన కారు బైకును బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న నలుగురు ఒక్కసారిగా గాల్లోకి ఎగిరి ఫ్లైఓవర్ పై నుండి పక్కన ఉన్న సర్వీస్ రహదారిపై పడ్డారు. దీంతో అనసూయ, జగన్, ప్రజ్ఞాశీల్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. హరికకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే హరీష్‌బాబు సందర్శించి బాధిత కుటుంబీకులను ఓదార్చారు.

పురోగమిశక్తులు కమ్యూనిస్టులు

- చెడును ఎదిరించి సమాజం మేలు కోసం పని చేస్తారు
- రానున్న కాలం ఎర్రజెండాది
- యువ కమ్యూనిస్టుల సమ్మేళనంలో తమ్మినేని



సమ్మేళనంలో మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో జరుగుతున్న చెడును ఎదిరించి సమాజం మేలు కోసం పనిచేసే పురోగమి శక్తులు కమ్యూనిస్టులని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో ఆదివారం యువ కమ్యూనిస్టుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యాలయం నుంచి బస్టాండ్‌సెంటర్, సుభాష్ విగ్రహం మీదుగా సిపిఎం కార్యాలయం వరకు ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. యువ సమ్మేళనం ప్రారంభ సూచికగా పార్టీ జెండాను తమ్మినేని వీరభద్రం ఆవిష్కరించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన సమ్మేళనంలో తమ్మినేని మాట్లాడారు. దేశంలో పెట్టుబడిదారీ విధానాల వల్లే అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రజలకు కనీస అవసరాలు కల్పించలేని పాలక విధానాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని తెలిపారు. రానున్నకాలం ఎర్రజెండాదని.. కమ్యూనిస్టులు పురోగమి శక్తులుగా అవతరిస్తున్నారని అన్నారు. శ్రీలంక లాంటి పరిణామాలే నిదర్శనమని అన్నారు. ప్రజలకు విద్య, వైద్యం, కనీస అవసరాలు తీర్చలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. ఎన్నికల్లో గెలవడం కోసం అమలు కాని హామీలు ఇచ్చి గెలిచాక ప్రజల్ని ఆర్థికసంక్షేమంలోకి నెట్టేసి ప్రజావ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయన్నారు. నాటి నుంచి ఇప్పటివరకు ప్రాణాలకు భయపడకుండా పోరాటం చేస్తోంది కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. బిజెపికి ప్రజాసమస్యలపై పోరాడిన చరిత్ర లేదన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ద్రోహం చేసి తాము దేశభక్తులమని అబద్ధ ప్రచారం చేసే ఆర్‌ఎస్‌ఎస్‌ను యువత తిప్పి కొట్టాలని అన్నారు. సమాజంలో జరుగుతున్న అసమానతలు అంతరాలపై యువకమ్యూనిస్టులు సంఘటితంగా పోరాడాలన్నారు.

ప్రశ్నించకుండా.. సమాజం ముందుకెళ్లదు : ఎండి జహంగీర్

యువత ప్రశ్నించకుండా పోరాడకుండా ఉంటే సమాజం తిరోగమనంలో ఉంటుందని, దోపిడీ వ్యవస్థను కూల్చేందుకు యువత ముందుకు రావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్ పిలుపునిచ్చారు. మనువాదం, మతోన్మాదం పేరుతో బిజెపి ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టి విభజన రాజకీయాలు చేస్తున్నదన్నారు. అది సామాజిక న్యాయానికి సమానత్వానికి వ్యతిరేకమన్నారు. ఇది రిజర్వేషన్ల అంశంలో తేలిపోయిందన్నారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపించేందుకు అగ్రభాగాన నిలవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మేక అశోక్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల్ల పెంటయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, బలుగూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ల నరసింహాచారి, బోయిని ఆనంద్, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు శానకొండ రామచంద్రం, మెట్టు శ్రవణ్‌కుమార్, మండల కమిటీ సభ్యులు గొరిగేసోములు, గన్నెబోయిన విజయభాస్కర్, నాగటి ఉపేందర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆ ముగ్గురు పార్టీ ద్రోహులు

- పార్టీ నుంచి బహిష్కరిస్తున్నాం : అభయ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మల్లోజుల వేణుగోపాల్‌రావు, తక్కళ్లపల్లి వాసుదేవరావు, ఆశన్న విప్లవ ద్రోహులుగా మారారని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామని మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట ఒక ప్రకటన విడుదల చేశారు. వారికి తగిన శిక్ష విధించాల్సిందిగా విప్లవ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. పార్టీకి, విప్లవ ప్రజలకు చెందిన ఆయుధాలను శత్రువులకు అప్పగించారని, ఈ చర్య విప్లవ ద్రోహం, పార్టీ విచ్ఛిన్నకర చర్య అని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌తో ప్రాణభీతి ఉన్నవారెవరైనా లొంగిపోదలిస్తే లొంగిపోవచ్చు కానీ పార్టీకి, విప్లవ ప్రజలకు చెందిన ఆయుధాలను శత్రువుకు అప్పగించకూడదని కోరారు.

ప్రభుత్వాలకు ఎవరు లొంగిపోయినా పార్టీ మాత్రం శత్రువుకు సరెండర్ కాదంటూ దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్టు ప్రకటించారు. వర్గాలున్నంతకాలం ఈ వర్గపోరాటాలు వాటి ఉన్నత రూపాలుగా ప్రజా యుద్ధాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

ప్రొఫెసర్ సుజిత్ కుమార్‌పై దాడికి ఎస్‌టిఎఫ్ఐ ఖండన

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ యూనివర్సిటీ డాక్టర్ భీంరావు అంబేడ్కర్ కాలేజీ క్రమశిక్షణా సంఘం కన్వీనర్ ప్రొఫెసర్ సుజిత్ కుమార్‌పై జరిగిన దాడిని ది స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎస్టీఎఫ్ఐ అధ్యక్షులు సిఎన్ భర్తీ, ప్రధాన కార్యదర్శి చావ రవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెండ్స్ యూనియన్ (డియుఎస్‌యు) జాయింట్ సెక్రటరీ, ఎబివిపి నాయకుడు దీపక్ ఝూ ప్రిన్సిపాల్ కార్యాలయంలో పోలీసులు, సిబ్బంది ముందే దాడి చేశారని వారు తెలిపారు. సదరు కాలేజీలో ఇటీవల చోటు చేసుకున్న ఘర్షణ నేపథ్యంలో క్రమశిక్షణ ప్రమాణాలకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో ఈ దాడి జరిగిందని చెప్పారు. ప్రొఫెసర్ సుజిత్ కుమార్ నిష్పక్షపాతంగా వ్యవహరించుకోవడాన్ని దీపక్ జీర్ణించుకోలేక ఆమోదించలేని హింసకు పాల్పడ్డారని వెల్లడించారు. ఈ దాడి విద్యాసంస్థల స్వతంత్రత, సమగ్రతలను ఉల్లంఘించడమే కాకుండా దేశవ్యాప్తంగా విద్యావేత్తల భద్రత, స్వతంత్రతకు పొంచి ఉన్న ప్రమాద ఘంటికలను సూచిస్తున్నదని వారు తెలిపారు. విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయునిపై దాడిని ఆ విద్యాసంస్థ సమగ్రతపై దాడి అని చెప్పారు. బోధనా సిబ్బంది నైతికస్థైర్యాన్ని దెబ్బతీయాలని, విద్యారంగంలో ఉండాల్సిన క్రమశిక్షణ, మంచి వాతావరణానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలను దెబ్బతీసేలా దాడి ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యాలయాల ప్రాంగణాల్లో భౌతిక హింస పెంచేలా రాజకీయ అనుబంధంతో చేసే చర్యలను అనుమతించేది లేదని వారు స్పష్టం చేశారు. సంబంధిత ఘటనపై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన క్రమశిక్షణా చర్యలతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

బాస్ బకాయిలు రూ.180 కోట్లు

- రెండేళ్లుగా చెల్లించని రాష్ట్ర సర్కార్
- 30 వేల మంది విద్యార్థుల ఇబ్బందులు
- బకాయిల విడుదలకు ప్రభుత్వం సుముఖత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల బెస్ట్ అవైలబుల్ స్కీం (బాస్)బకాయిలు రోజు రోజుకు పేరుకు పోతున్నాయి. ఏడాదికి రెండు పర్యాయాలు చెల్లించాల్సిన ఫీజులను రెండేండ్లయినా విడుదల చేయలేదు. దీంతో యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే రూ.180 కోట్లు బకాయి ఉంది. సుమారు 30వేల మంది విద్యార్థులు బాస్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యాజమాన్యం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుంది.

పండగ నాటికి ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని యజమాన్యాలు చెప్పినట్టు తెలుస్తోంది. ఫీజు క్లీయర్ కాకుండా తరగతి గదిలోకి రానియ్యమంటూ యాజమాన్యాలు చెప్పినట్టు తెలుస్తున్నది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోలనకు గురవుతున్నారు.

సర్కార్ కాలయాపన..

విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని బకాయిలు విడుదల చేసి, యదాతదంగా వారికి విద్యా బోధన అందించేందుకు కృషి చేయాల్సిన సర్కార్..మీన మేషాలు లెక్కిస్తోంది. మాటలతో కాలయాపన చేస్తోంది .దీంతో విద్యార్థి, యువజన సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన బాటపట్టటంతో ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ పథకం పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. పండుగ తర్వాత సగం బకాయిలు చెల్లించనున్నట్టు కూడా ప్రకటించారు. ఆచరణలో వాస్తవ రూపం దాల్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రజా ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిష్టాత్మంగా తీసుకున్నదని సన్నాయి నొక్కులు నొక్కుతూనే ..బెస్ట్ అవైలబుల్ స్కీం కింద నిధులకు సంబంధించిన ఒప్పందం పాఠశాల యాజమాన్యాలు, జిల్లా యంత్రాంగం మధ్యన జరిగిందనీ, ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే అక్కడే పరిష్కారం చేసుకోవాలని ప్రభుత్వం ఉచిత సలహాలు ఇస్తున్నది. జిల్లా స్థాయిలో ఒప్పందాలు జరిగాయి కాబట్టి అక్కడే తేల్చుకోవాలని చెప్పడం సమంజసమా? ఆ ఒప్పందాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఇప్పుడు జిల్లా అధికారులపై నెపాన్ని నెట్టేసి, తామకు సంబంధం లేనట్టుగా వ్యవహరించటం తగదని విద్యార్థుల తల్లిదండ్రులు హితవు పలుకుతున్నారు. దీనికి సమాధానం ప్రభుత్వం చెప్పాలి. ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను అందించేందుకు ఈ స్కీం ద్వారా ప్రాథమిక తరగతిలో ఒక్కో విద్యార్థికి ఏటా రూ.28 వేలు, ప్రాథమికోన్నత తరగతిలో వసతితో కలిపి రూ.42 వేల చొప్పున చెల్లిస్తారు. ప్రభుత్వం ఎంపిక చేసిన 230 ప్రయివేట్ పాఠశాలల్లో ఎస్‌సి విద్యార్థులు 23 వేల మంది, ఎస్‌టి విద్యార్థులు ఏడు వేల మందికి ఉచిత విద్య, భోజనం, పుస్తకాలు, బట్టలు, వసతి కల్పించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిధులను చెల్లించడం వల్ల ఈ పథకం సజావుగా సాగేందుకు అవకాశం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకం స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యార్థులను చదువుకు దూరం చేయొద్దు..
టి నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బాస్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం వేల మంది విద్యార్థులను చదువుకు దూరం చేస్తోంది. ఏటా బకాయిలు పేరుకు పోతున్నాయే తప్ప ,క్లీయర్ చేయడం లేదు. ప్రభుత్వానికి కాంట్రాక్టుల మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల చదువుల మీద లేదు. ఇది ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల పట్ల చిన్న చూపు తప్ప మరొకటి కాదు.. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి. కుంటి సాకులు కట్టిపెట్టి విద్యార్థుల భవిష్యత్‌కోసం తగిన నిర్ణయం తీసుకోవాలి.

స్వీట్‌లో సింథటిక్....

- రాష్ట్రవ్యాప్తంగా స్వీట్ తయారీ కేంద్రాలు, షాపుల్లో తనిఖీలు
- 234 నమూనాలను సేకరించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు
- రిజిస్ట్రేషన్ ఉన్న షాపుల్లోనే కొనుగోలు చేయాలని సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా 95 స్వీట్ల తయారీ కేంద్రాలు, షాపుల్లో ఫుడ్ సేఫ్టి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా దాదాపు వంద కేజీల కల్తీ ఆహారాన్ని సీజ్ చేశారు. దీపావళి పండుగ నేపథ్యంలో ప్రజారోగ్యాన్ని దష్టిలో ఉంచుకుని ఏకకాలంలో 33 జిల్లాల్లో చేపట్టిన తనిఖీల్లో అనేక లోపాలను కనుగొన్నారు. ఈ తనిఖీల్లో కొన్ని చోట్ల వీటి తయారీకి నిషేధిత పదార్థాలను వినియోగించడం, గడువు తీరిన ఉత్పత్తులుండటాన్ని గుర్తించారు. ఎక్కువగా మిల్క్ తో తయారు చేసే జిలేబీ, లడ్డు తదితర వాటిలో ఎక్కువగా సింథటిక్ ఫుడ్ కలర్స్‌ను వాడుతూ ఫుడ్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘించినవే ఎక్కువగా ఉన్నాయి. స్వీట్ల తయారీలోనూ కల్తీ నెయ్యి, వాడిన వంట నూనేలను తిరిగి ఉపయోగిస్తున్నట్టు నిర్ధారించారు. కొన్ని చోట్ల వెంటి రేకును పెట్టడం, తయారీ, అమ్మకాల ప్రాంగణాలు పరిశుభ్రంగా లేకపోవడం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల దృష్టికి వచ్చింది. లేబుల్ చేయనీ, గడువు తీరిన వాటిని కూడా అమ్ముతున్నట్టు గుర్తించారు. అధికారులు 60 కేజీల స్వీట్స్, 40 కేజీల బ్రెడ్స్ , ఇతర కల్తీ ఆహారంగా అనుమానించిన వాటి సేకరించి వారికి నోటీసులు జారీ చేశారు. 234 నమూనాలను పరీక్షల కోసం ఫుడ్ టెస్టింగ్ ల్యాబోరేటరీకి పంపించారు. కొన్ని చోట్ల ఫుడ్ సేఫ్టీ వీల్స్ అందుబాటులో ఉండటంతో ఆహార నాణ్యతపై అక్కడికక్కడే తనిఖీ నిర్వహించారు. ల్యాబ్ లకు పంపించిన నమూనాలపై రిపోర్ట్ వచ్చాక తదుపరి ఫుడ్ సేఫ్టీ నిబంధనల మేరకు చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు.

కొనుగోలు చేసే ముందు...

ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) రిజిస్ట్రేషన్ ఉన్న షాపుల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని వినియోగదారులకు ఫుడ్ సేఫ్టీ అధికారులు సూచించారు. ఆయా షాపుల్లో ఫుడ్ సేఫ్టీ రిజిస్ట్రేషన్ నెంబర్‌ను అందరికి కనిపించేలా పెట్టాలని సూచించారు. కొనుగోలు చేసే ముందు సరైన ప్యాకేజింగ్, తయారీ తేదీ, గడువు తీరే తేదీ తప్పనిసరి చూడాలని ప్రజలను కోరారు.

పోలీసుల అదుపులో రియాజ్

- కానిస్టేబుల్‌ను హత్య చేసిన దుండగుడి అరెస్టు
- ఎన్‌కౌంటర్ అంటూ పుకార్లు :కొట్టిపారేసిన సిపి


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 17న(శుక్రవారం) సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను కత్తితో పొడిచి హత్య చేసిన నిందితుడు రియాజ్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని 6వ టౌన్ పరిధిలో ఆసీఫ్ అనే వ్యక్తిపై సైతం రియాజ్ దాడి చేయగా.. అక్కడ పెనుగులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఇద్దరికి గాయాలు అయ్యాయి. స్పందించిన పోలీసులు రియాజ్‌ను అదుపులోకి తీసుకొని ఆస్పత్రికి తరలించారు. కాగా రియాజ్ ఎన్‌కౌంటర్ అయినట్టు సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. సిపి సాయిచైతన్య స్పందించి వాటిని కొట్టిపారేస్తూ ప్రకటన విడుదల చేశారు. వివిధ కేసుల్లో నిందుతుడిగా ఉన్న రియాజ్‌ను సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్, ఏఎస్ఐ విఠల్ కలిసి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. బైక్‌పై స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో డ్రైవింగ్ చేస్తున్న ప్రమోద్‌పై.. నిందితుడు రియాజ్ కత్తితో దాడి చేశాడు. వెనుకాల మరో బైక్‌పై వస్తున్న ఏఎస్ఐ విఠల్.. అడ్డుకునేందుకు ప్రయత్నం చేయగా.. ఆయనపై సైతం దాడి చేసి నిందితుడు పరార్ అయ్యాడు. దీంతో నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలిపిన వారికి రూ.50 వేల రివార్డు సైతం ప్రకటించారు. 6వ టౌన్ పరిధిలో నిందితుడున్నట్టు ప్రాథమిక సమాచారం అందడంతో శనివారం రాత్రి నుంచి పోలీసులు తనిఖీలు చేపట్టారు. నిందితుడి బైక్ కెనాల్ సమీపంలో లభించడంతో.. డ్రోన్‌ల సాయంతో సైతం గాలింపుచర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం సారంగాపూర్ శివారులోనే ఓ లారీ క్యాబిన్‌లో దాక్కున్నట్టు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లగా.. పోలీసులను చూసి నిందితుడు పారిపోయాడు. నెహ్రూ నగర్‌కు చెందిన అసిఫ్ రియాజ్‌ను పట్టుకోవడానికి వెళ్లగా సదరు నిందితుడు తన వద్ద ఉన్న కత్తితో దాడి చేశాడు. ఈ క్రమంలో పెనుగులాట చోటుచేసుకోవడం తో ఇద్దరికి గాయాలు అయ్యాయి. హుటా హుటిన పోలీసులు నిందితుడిని అదుపు లోకి తీసుకొని ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు.

ఎన్‌కౌంటర్ అంటూ పుకార్లు

కాగా నిందితుడు రియాజ్ ఎన్‌కౌంటర్ అయినట్టు సోషల్ మీడియాలో పుకార్లు వెల్లువెత్తాయి. నిందితుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో కత్తితో దాడి చేయడంతో ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు కాల్పులు చేయడంతో మృతిచెందినట్లు ప్రచారం జరిగింది. ఈ ప్రచారాలను సీపీ సాయిచైతన్య ఖండించారు.

నామినేషన్లతో ట్రిబుల్‌ఆర్ బాధితుల నిరసన !


ANNEXURE 59
Chapter 24, Para 24.3
FORMAT FOR ISSUING CERTIFIED COPY OF EXTRACT FROM ELECTORAL ROLL (with photograph)
OFFICE OF THE ELECTORAL REGISTRATION OFFICER, 93-MUNUGODE ASSEMBLY CONSTITUENCY
No. B1/792/2025 Dated: 18.10.2025.
EXTRACT FROM ELECTORAL ROLL OF 93 – MUNUGODE ASSEMBLY CONSTITUENCY IN THE TELANGANA STATE
PART NO. 87, Serial No. 208
Section No. 1-Main Village
EPIC NO. RLS1355148
Elector's Name: Vardham Nagarjuna
Father's Name: Lachaiah
House No: 10-86,
Age: 42 Sex: Male
Certified to be true extract from the electoral roll of the above-mentioned constituency, revised w.r.t. 06.01.2025 as the qualifying date and as in the force on the date of issue of this certificate.
Place: Narayanapur.
Date: 18.10.2025
Electoral Registration Officer, 93-Munugode Assembly Constituency & Revenue Divisional Officer, Chandur

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిబంధనలకు విరుద్ధంగా ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను రూపొందించిన రాష్ట్రప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బాధిత రైతులు జూబ్లీహిల్స్ ఉపఎన్నిల్లో నామినేషన్ వేసి నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ట్రిబుల్‌ఆర్ బాధిత రైతులు 40 మంది వరకు నామినేషన్ దాఖలు చేసినట్టు తెలిసింది. తాజాగా నారాయణపురం మండలంలో సర్వేలు, పుట్టపాక గ్రామానికి చెందిన మరో ఆరుగురు రైతులు ఈ నెల 21 ఆఖరి రోజున నామినేషన్‌లు దాఖలు చేసి నిరసన తెలియజేస్తామని తెలిపారు. ఎర్రగుంట గ్రామానికి చెందిన గుండె మల్లేష్, వర్ధన్ నాగార్జున పుట్టపాక గ్రామానికి చెందిన నెల్లికంటి నాగరాజు, గాజుల అంజయ్య, నక్క రమేష్, సుక్క యాదయ్య ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి నామినేషన్ పత్రాలను తీసుకున్నారు. 2022లో నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనను నిరసిస్తూ మునుగోడు ఉపఎన్నికల్లో సైతం 60 మంది నామినేషన్లు వేసి 12 మంది బరిలో నిలిచారు. గతంలో పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ బాధితులు తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలిపేందుకు నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో 200 మందికి పైగా నామినేషన్లు వేసి నిరసన తెలిపిన విషయం విధితమే. అదే తరహాలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లోనూ బాధిత రైతులు తమ ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని నిరసిస్తూ నామినేషన్లతో నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్నారు.

యువకుడి ప్రాణం తీసిన పేకాట

- స్థావరంపై పోలీసులు దాడి చేయడంతో.. తప్పించుకునే క్రమంలో విద్యుత్ షాక్‌తో మృతి?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేకాట ప్రాణం తీసింది. పేకాటాడుతున్నారనే సమాచారంతో పోలీసులు పేకాట స్థావరంపై దాడిచేయగా.. తప్పించుకునే క్రమంలో యువకుడు విద్యుత్ షాక్‌తో మృతిచెందారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని పెద్దదడ్గీ గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి గ్రామానికి చెందిన కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు పేకాట స్థావరంపై దాడిచేశారు. పేకాటాడుతున్న వ్యక్తుల్లో వడ్ల రవి (22) అనే యువకుడు పంట పొలాల్లోకి పారిపోయారు. ఈ క్రమంలో బోరు మోటర్ వద్ద విద్యుత్ వైర్‌కు తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం గ్రామ శివారులో వెతకగా పంట పొలాల్లో చనిపోయి ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాన్సువాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి యువకులను వెంబడించడం వల్లనే రవి విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందినట్టు గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయంపై ఎస్ఐ మోహన్‌రెడ్డిని వివరణ కోరగా.. రవి కాలకృత్యాలకు వెళ్లి పంట పొలాల్లో విద్యుత్ వైర్‌పై జారిపడటంతో షాక్‌కు గురై మృతిచెందినట్టు తెలిపారు.

అందరి లెక్కలు తేలుస్తాం

- పేదల ఇళ్లపై ప్రతాపం మానుకోవాలి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఇంతకు ముందు లెక్క ఉండది..అధికారంలోకి వచ్చిన తర్వాత అందరి లెక్కలు తేలుస్తాం' అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాజేంద్ర నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపిపి చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, ఆయన కుమారుడు పెద్దషాపూర్ మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్, 2018లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసిన అంజిబాబు దంపతులు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లను కూల్చిన సర్కార్.. ఇప్పటివరకు ఒక్క బడా వ్యక్తి ఇంటిని ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. సిఎం రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు చెరువులోనే ఉందనీ.. ఆ ఇంటి జోలికి మాత్రం వెళ్లడం లేదని విమర్శించారు. పట్నం మహేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్, కెవిపి రామచంద్రరావు ఇళ్లు చెరువులోనే ఉన్నా వాటిని ఎందుకు ముట్టుకోవడం లేదని నిలదీశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ అనిల్ కుమార్

తల్లిని కడ తేర్చిన కొడుకులు, మనవళ్లు

- రైతుబంధు పింఛన్ డబ్బులే హత్యకు కారణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వృద్ధాప్యంలో భర్త మరణించిన అనంతరం సంరక్షించవలసిన కొడుకులు, మనవళ్లు కన్నతల్లి పట్ల కర్కశంగా వ్యవహరించారు. రైతుబంధు, పింఛన్ డబ్బుల కోసం 80 ఏళ్ల వద్ధ తల్లిని హత్య చేశారు. ఈ సంఘటన వట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్వెల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. జోగుపేట సిఐ అనిల్ కూమార్ వివరాలను వెల్లడించారు. మార్వెల్లి గ్రామానికి చెందిన చాకలి బసమ్మ (80)ను జులై నెల మూడున కొడుకులు, మనవళ్లు కలిసి విపరీతంగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయింది. దాంతో కొడుకు బషయ్య జోగుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసము సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు అసహజ మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. ఈ నెల 18న వైద్యుల నివేదికలో కొట్టి చంపినట్టు... చాతిలో, ఇతర భాగాలపై బలమైన దెబ్బలు తగిలినట్టు, చాతిలో రక్తం గడ్డలు కట్టడంతోనే వృద్ధురాలు మృతి చెందారని తేలిందన్నారు. అ సహజ మరణం నుండి హత్య కేసుగా నమోదు చేసినట్టు తెలిపారు. గ్రామానికి వెళ్లి బసమ్మ కొడుకులను, మనవళ్లను అదుపులోకి తీసుకొని విచారించగా.. పోషణ విషయములో అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయని, ఆమె పేరుతో ఉన్న భూమికి రైతుబంధు వస్తుందని, పింఛన్ డబ్బులను అందరికీ సమానంగా ఇవ్వకుండా ఒకరికి ఇస్తుండడంతో మద్యం మత్తులో కర్రలతో కొట్టి చంపినట్టు అంగీకరించారు. హత్య నేరాన్ని అంగీకరించడంతో బషయ్య, అంబయ్య, వెంకయ్య, నరసింహులు, మోహన్, రాజు (చిన్న)ను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లవకుమార్ పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో స్వర్ణకారుడు ఆత్మహత్య

- పెరిగిన బంగారం ధరలతో పనిలేదని మనస్తాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆకాశానికి పరుగు పెడుతున్న బంగారం ఓ స్వర్ణకారుడి మెడకు ఉరి తాడైంది. రోజు రోజుకు బంగారం ధరలు పెరుగుతుండడం, మరోవైపు బంగారు కొనుగోళ్లులేకపోవడంతో చేసేందుకు పనిలేక, ఆర్థిక ఇబ్బందులు తాళలేక స్వర్ణకారుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు మెదక్ పట్టణం పెద్ద బజార్‌కు చెందిన స్వర్ణకారుడు నరేష్ చారి (40) గోల్డ్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. స్వర్ణ వృత్తి పైనే ఆధారపడి భార్య బాలామణి, ఇద్దరు కుమార్తెలను పోషిస్తున్నారు. గత కొన్ని నెలలుగా బంగారం ధరలు రోజు రోజుకు ఆకాశాన్నంటుతుండడంతో గతంలో ఉన్నట్టు వ్యాపారం సాగక స్వర్ణకారులకు పని కూడా దొరకడం లేదు. కొన్ని నెలల పాటు అప్పు చేసి కుటుంబాన్ని పోషింస్తూ వచ్చారు. అప్పులు పెరగడంతో ఆర్థికం ఇబ్బందులుపెరిగిపోయాయి. వాటిని తీర్చేమార్గం లేక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పనులు లేకపోవడం వల్లే ఆర్థిక ఇబ్బందులు ఎదురై నరేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్ పట్టణ సిఐ మహేష్ తెలిపారు.